సంపుటి: 3 | సంచిక: 3

మార్చి - ఏప్రిల్, 2015

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



మనుష్యుల అందరి పాపముల నిమిత్తము యేసుక్రీస్తు సిలువవేయబడెను.

అదే గుడ్ ఫ్రైడే



# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

క్రీస్తు నందు ప్రియమైన దేవుని స్పర్శ పాఠకులకు వందనములు. గడిచిన రెండు నెలలు క్షేమమును, నెమ్మదిని అనుగ్రహించిన దేవునికి స్తోత్రములు.

భూమి మీద మానవుని మనుగడ క్రమక్రమముగా కష్టతరముగా మార్చుబడుచున్నది. ఎన్నడూ లేనన్ని సదుపాయములు సమకూర్చుకొను చున్నప్పటికి, సాంకేతిక విప్లవం ద్వారా ఎన్నో సౌఖ్యములు కలుగుచున్నప్పటికి మనుష్యుల మనస్తత్త్వములు ఇంకా సంకుచితమై పోవుచున్నవి. ఇంటర్నెట్ స్పీడు క్రమక్రమముగా ఎలా పెరుగుచున్నదో మనుష్యుల జీవితములలో విశాల హృదయం అలా తగ్గిపోవుచున్నది. ఒకానొక రోజున మన సమాజములో ఉమ్మడి కుటుంబములలో కొంత సంతోషమును అనుభవించేవారు. ఈ సంతోషము కొరకు కొన్ని కొన్ని త్యాగములు చేసేవారు. క్రమక్రమముగా అందరితో కలిసి జీవించలేని పరిస్థితి నుండి ఒంటరి కుటుంబములుగా అనగా నేను నా భార్య లేక భర్త, పిల్లలు అనే స్థాయికి చేరుకున్నాము. నేడు ఈ చిన్న కుటుంబములో కూడా సంతృప్తిగా జీవించలేక ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నాము. దానికి కారణం తోటి వారిని అర్థం చేసుకోలేని పరిస్థితి, ప్రతివారు వారి మాటే నెగ్గాలని చూడడం తద్వారా భయంకరమైన పరిస్థితులు. ఇలాంటి పరిస్థితులలో మన హృదయం మార్చుగలిగిన మహనీయుడైన యేసుక్రీస్తు సహాయం ఎంతైనా అవసరం. బైబిల్‌లో హృదయం ఎంతో మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది అని చెప్పిన దేవుని మాటలను బట్టి మనము హృదయమును శుద్ధి చేయగలిగిన యేసుక్రీస్తును ఆశ్రయించవలెను. ఆయన మన హృదయమును బాగుచేయడం ద్వారా మన జీవితములో ప్రేమ, సంతోషము, సమాధానము, క్షమించే గుణం కలిగి ముందుకు వెళ్ళగలుగుతాము.

అట్టి ధన్యతను ప్రతి ఒక్కరికి దేవుడు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 3 | సంచిక: 3

మార్చి - ఏప్రిల్, 2015

దేవుని

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...

ఈస్టర్ ..... 2
బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు ..... 5
ఐక్యత (స్త్రీల ప్రత్యేకం) ..... 6
నోరు జారిన మాటలు ..... 9
సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 39వ భాగము ..... 10
దైవచిత్తము ..... 12
ఆశా నిగ్రహం (బాలల శీర్షిక) ..... 14
నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ..... 16
సులభమైన ప్రార్థనా శక్తి ..... 18
ఆహారపు అలవాట్లు, శరీర పోషణ ..... 20
బైబిల్ క్విజ్ - 39 ..... 22
జన్మదిన శుభాకాంక్షలు ..... 23

మా చిరునామా:
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



# ఈస్టర్

- బ్రదర్. ఎపఫ్రా

ప్రభువైన యేసుక్రీస్తు 2000 సంవత్సరముల క్రితం ఈ లోకమునకు వచ్చి, ఈ లోకములో జీవించిన 33 1/2సం॥ల కాలములో నీతిగానూ, యథార్థముగాను ఉండి సమస్త మానవాళి పాపశిక్షను తన శరీరము మీద భరించి, సిలువలో వ్రేలాడి మరణించి మూడవ దినమున తిరిగి లేచెను. దీనినే మనం ఈస్టర్ గానూ, పునరుత్థానపు ఆదివారముగాను ఆచరిస్తాము.

ఆయన మృతులలో నుండి మూడవ దినం తిరిగి లేచి మరణమును జయించి పునరుత్థానుడై శిష్యులకు, కొందరు స్త్రీలకు కనిపించి చెప్పిన మాటలు నేటికీ మన జీవితములకు ఎంతో ప్రాముఖ్యమైనవి.

**1. యేసు – భయపడకుడి మీరు వెళ్ళి, నా సహోదరులు గలిలయకు వెళ్ళవలెననియు వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడనెను. మత్తయి 28:10**



యేసుక్రీస్తు సిలువవేయబడిన తరువాత మూడవ దినమున ఆయనను వెదకుచున్న స్త్రీలకు దూత కనపడి భయపడకుడి యేసు ఇక్కడ లేడు ఆయన మృతులలో నుండి లేచియున్నాడని చెప్పెను. ఈ వార్తను శిష్యులకు తెలియచెప్పవలెనని వారు భయముతోనూ, మహా ఆనందముతోనూ, పరిగెత్తుచుండగా యేసు వారిని ఎదుర్కొని భయపడకుడి అని చెప్పెను. మన జీవితములో కుటుంబ సమస్యలను బట్టి, భవిష్యత్తును బట్టి, పరిస్థితులను బట్టి హృదయములో భయమును కలిగి, కలవరపడుతూ ఉంటాము. భయము మనలను కృంగిపోయేవారిగా చేసి, నిరీక్షణ లేనివారిగా, ఏ పనిని చేయలేని వారిగా మారుస్తుంది. అందుకే మనము పునరుత్థానుడైన యేసయ్య స్త్రీలైన వారితో **భయపడకుడి** అని చెప్పిన ఆ మాటను హృదయములో చేర్చుకొని ఆయన మీద విశ్వాసముంచి, వెంబడించే వారిగా ఉన్నప్పుడు ఏ పరిస్థితులకు భయపడము. సమస్య కలిగినను, నింద, అవమానము కలిగిననూ పునరుత్థానుడైన యేసును చూచుచు నిర్భయముగా జీవిస్తూ ముందుకి కొనసాగుదాము.

 అడుగునున్న ఆకు రాలిపోయినప్పుడు పైనున్న ఆకు నవ్వకూడదు... రేపటి వంతు తనదే మరి

**2. ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి, తాము కూడియున్న ఇంటి తలుపులు మూసికొని యుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి – మీకు సమాధానము కలుగును గాక అని వారితో చెప్పెను. యోహాను 20:19**

ఆయన శరీరధారియైన దినములలో శిష్యులు ఆయనను వెంబడించుచూ, ఆయనతోనే ఉండి అనేక ఆశ్చర్యకార్యములను చూచిరి. ఆయన సిలువవేయబడి మూడవ దినమున తిరిగి లేస్తానని చెప్పినప్పటికి ఆయన సిలువ వేయబడిన తరువాత భయముతో, హృదయములో కలవరముతో గదిలో ఉండగా వారికి యేసయ్య ప్రత్యక్షమై **మీకు సమాధానము కలుగును గాక** అని చెప్పెను. మన జీవితములో కూడా చాలా సార్లు అనేకమైన విషయములను బట్టి, లోకాశలను బట్టి హృదయములో సమాధానము పోగొట్టుకొని, సంతోషము లేక జీవిస్తూ ఉంటాము. అయితే మనకు, మన కుటుంబములకు సమాధానము అనుగ్రహించుటయే ఆయన ఉద్దేశ్యమై యున్నది. ఆయనను అంగీకరించిన వారి జీవితములో మొట్టమొదట హృదయములో సమాధానము కలుగుతుంది. హృదయములో ఉన్న సమాధానము మనలను సంతోషముగా ఉంచుతుంది. నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను అని చెప్పబడిన మాటను మనము నమ్మాలి. ఆయన మనకు అనుగ్రహించిన శాంతి, సమాధానము ఈ లోకములో మనుష్యులెవ్వరు ఇవ్వలేరు. ఆయన శిష్యులు అనేకులను బలపరచి, ధైర్యపరచాలంటే మొట్ట మొదట వారి హృదయములో సమాధానము ఉండాలని ఆయన ఎరిగి వారితో పలికిన ఆ మాట మనతో కూడా మాట్లాడుచున్నారని గ్రహించుకొని మనము సమాధానముతో జీవిస్తూ, అనేకులను బలపరిచే వారిగా ఉందాము.

**3. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. మత్తయి 28:19**



**సమస్త జనులను నా శిష్యులుగా చేయుడి** అని దేవుడు చెప్పిన మాట ఎంతో లోతైన అర్థమును మనకు కనుపరచుచున్నది. ఆది యందు ఆదాము, హవ్వలు చేసిన పాపమును బట్టి ఈ లోకమునకు కలిగిన శాపము నుండి దేవుడు మనలను విడిపించుటకు సిద్ధపరచిన ఆయన రక్షణ కార్యములో మనం నడవాలని కోరుకొనుచున్నాడు.

సమస్త జనులను శిష్యులుగా చేయుట అనగా ఆయన ప్రేమను, దయను, కనికరమును, మంచితనమును, క్షమాగుణమును కలిగి జీవించే వారిగా తీర్చిదిద్దుటయే. ప్రతి మనుష్యుడూ ఈ విధమైన సుగుణములను కలిగి జీవించుట వలన లోకములో నెమ్మది, ఈ భూమి మీద మనుష్యులకు శాంతి కలుగుతాయి. మొదటి మనుష్యుడైన

ఆదాము ద్వారా పోగొట్టుకొనిన ఆశీర్వాదము ఆయన శిష్యులుగా మనము మారుట ద్వారా తిరిగి పొందగలము. ఆయన సమస్త జనులను శిష్యులుగా చేయుడి అని చెప్పిన మాట శిష్యులైన పదకొండు మందికే కాక నేడు ఆయనను విశ్వసించిన ప్రతివారు ఈ లోకములో ఉన్న సమస్త జనులను ఆయనకి శిష్యులుగా చేయాలన్న తపనతో ప్రతిదినము జీవించవలసిన వారమై యున్నాము. నిజమైన శిష్యులు మాత్రమే మరికొందరిని శిష్యులుగా చేయగలరు. యేసయ్య మాటను విన్న ఆ పదకొండు మంది శిష్యులు తమ ప్రాణములను కూడా లక్ష్యపెట్టక, ప్రపంచవ్యాప్తంగా అనేకులను శిష్యులుగా తీర్చిదిద్దారు. మనము కూడా మన జీవిత కాలములో అనేకులను ఆయన శిష్యులుగా సిద్ధపరచవలసిన వారమై యున్నాము.

**4. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను మత్తయి 28:20**

యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో కూడా ఉన్నాను అని ఆయన పునరుత్థానుడై తిరిగి లేచిన తరువాత చెప్పిన మాట ఎంతో అద్భుతమైనది ఎందువలననగా ఆయన శరీరధారిగా ఉన్న దినములన్నిటా ఆయన కేవలము ఒకచోట ఉండుట మాత్రమే సాధ్యమయ్యింది. ఆయన పునరుత్థానుడై తిరిగి పరలోకమునకు వెళ్ళిన తరువాత ఆత్మస్వరూపిగా అనగా పరిశుద్ధాత్మ దేవునిగా ఎల్లప్పుడూ మనతోనూ, మనలోనూ ఉంటానని వాగ్దానము చేసారు. యోహాను 14:16 ప్రకారము ఆదరణకర్తగా మనలో ఉండటం, మనతో ఉండటం ఎంతో ధన్యకరమైనది. ఈ దినములలో ప్రతి మనిషికి వేరొక మనుష్యుడు తోడై ఉన్నట్లుగా పరిశుద్ధాత్మ దేవుడు ఆయనను విశ్వసించి, పాపక్షమాపణ పొందిన ప్రతి వ్యక్తితో కూడా ఉండటం ఎంతో ఆశ్చర్యమును కలిగిస్తుంది. ఈ లోకములో తల్లిదండ్రులైనా, అన్నదమ్ములైనా, కన్నబిడ్డలైనా కొంతవరకే మనతో ఉండగలుగుతారు. వాక్య ప్రకారము ఏకశరీరము అనుకొనే భార్యాభర్తలు కూడా అన్ని సమయములలోనూ ఒకరితో ఒకరు కలిసి ఉండలేరు. పరిశుద్ధాత్మ దేవుడు భాదలలో నెమ్మదిని కలిగించి దుఃఖసమయములలో ఓదార్చి, కృంగిన సమయములలో ధైర్యపరచి, వాక్యములను మనకు జ్ఞాపకము చేయుచూ, పాపములను ఒప్పింప చేస్తూ మన జీవితమును నడిపిస్తారు. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు, మనమైతే ఆయనను ఎరుగుచున్నాము, ఆత్మీయ నేత్రములతో చూచుచున్నాము. యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో కూడా ఉన్నాను అనే వాగ్దానమునకు మనము వారసులమై యున్నాము.



# బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు

| | |
|---|---|
| 54. యేసు పునరుత్థానము చెందుట | మత్తయి 28, మార్కు16, లూకా 24, యోహాను 20 |
| 55. యేసు యొక్క పది మహిమాన్వితమైన ప్రత్యక్షతలు | మత్తయి 28, మార్కు 16, లూకా 24, యోహాను 20,21 |
| 56. యేసు గొప్ప పనిని తన శిష్యులకు అప్పగించుట | మత్తయి 28:18-20 |
| 57. యేసు పరలోకమునకు ఆరోహణమగుట | అపో.కా॥ 1:9-11 |
| 58. పెంతెకొస్తు పండుగ దినము | అపో.కా॥ 2 |
| 59. పుట్టినది మొదలుకొని కుంటివాడైన ఒక మనుష్యుని పేతురు, యోహానులు స్వస్థపరచుట | అపో.కా॥ 3:1-11 |
| 60. మొదటి పరిచారకులను ఎన్నుకొనుట | అపో.కా॥ 6:1-8 |
| 61. స్తెఫను హతసాక్షి మరణము పొందుట | అపో.కా॥ 7:1-60 |
| 62. సౌలు క్రీస్తును అంగీకరించుట | అపో.కా॥ 9:1-20 |
| 63. అంతియొకయ సంఘమును స్థాపించుట | అపో.కా॥ 11:19-26 |
| 64. హేరోదు యాకోబును చంపించుట మరియు పేతురు చెరసాల నుండి విడుదల పొందుట | అపో.కా॥ 12:1-19 |
| 65. పౌలు ప్రప్రథమముగా సువార్త పర్యటన చేయుట | అపో.కా॥ 13:2 - 14:28 |
| 66. యెరూషలేములో పెద్దల, అపొస్తలుల సమావేశము | అపో.కా॥ 15:1-35 |
| 67. పౌలు యొక్క రెండవ సువార్త పర్యటన | అపో.కా॥ 15:36-18:22 |
| 68. పౌలు యొక్క మూడవ సువార్త పర్యటన | అపో.కా॥ 18:23-21:16 |
| 69. పౌలు రోములో బంధింపబడుట | అపో.కా॥ 21:30 |
| 70. యోహానును పత్మాసు ద్వీపమునకు చెరగొనిపోవుట మరియు అచ్చట ప్రకటన గ్రంథమును వ్రాయుట | ప్రకటన 1:9 |



# ఐక్యత

– సిస్టర్ వి.విజయ

కుటుంబం బాగుంటే సమాజము బాగుంటుంది. సంఘము ఐక్యతతో ఉంటే దేవుని పని, ఆయన రాజ్య వ్యాప్తి విస్తారముగా జరుగుచూ, క్షేమముతో ముందుకి వెళ్తుంది. వీటన్నిటికి భిన్నంగా నేడు కుటుంబములలో, సంఘములలో జరుగుచున్నది. కుటుంబములలో ఒకరి కంటే ఒకరు గొప్ప అని తగ్గించుకోని స్వభావము, పిల్లల మీద ప్రభావమును చూపుచూ, మానవ సంబంధములను దెబ్బ తీస్తున్నాయి. వివాహాలు విఛిన్నం అవుతున్ననూ మనుష్యులు తేలికగా తీసుకుంటున్న స్థితి కనబడుచున్నది. భార్యభర్తలు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు పిల్లలు – వీటికి ఎవరూ అతీతులు కారు. ఒక్క కుటుంబాల లోనే కాక, ఏ ఇద్దరి వ్యక్తుల మధ్య చూచిననూ సత్సబంధములు లేని స్థితి. దేవునిని ఎరిగిన కుటుంబములలో కూడా ఒకరంటే ఒకరికి పడని పరిస్థితి, అధికారములు, ఘనతలు, పదవుల కొరకు పోటీలు పడే మనస్తత్త్వములు దేవుని పనిని ముందుకి తీసుకు వెళ్ళడానికి ఆటంకముగా ఉంటున్నాయి.

ఒక్కొక్కరిది ఒక్కొక్క వ్యక్తిత్వము, వేరు అనుభవములు, వివిధ ప్రాంతములు, వ్యత్యాసమైన ఆలోచనలు, వేరు వేరు లక్ష్యములు ఉండవచ్చు కానీ, ఒకే గురి ఒకే మనస్సుతో పని చేయుట అనేది ఐక్యత. ఇది ఎంతో ప్రాముఖ్యమైనది, మనము వర్ణించలేనంత శక్తి ఉంది దీనిని సరిగా అర్థం చేసుకొని, ఆ ప్రాముఖ్యతను గ్రహిస్తే ఐక్యతను అనుసరిస్తూ, కాపాడుకొనుట యందు శ్రద్ధను కలిగి ఉంటాము. అందుకే బైబిల్ గ్రంధములో కీర్తనా కారుడైన దావీదు ఎంతో మనోహరమైన మాటగా ఐక్యతను వర్ణించడం జరిగింది. సహోదరులు ఐక్యతతో నుండుట ఎంత మేలు ఎంత మనోహరము కీర్తన 133:1

ఈ వాక్యమును స్త్రీలమైన మనకి అన్వయించుకుంటే, ఆ విధంగా ఉంటే ఆ మనోహరమైన అనుభవములు, ఆ సంతోషం అనుభవించగలము. ఐక్యత మనలను అన్ని విషయములలో బలంగా నిలిపి సంతోషంగా ఉంచుతుంది. చీలిక (లేక) విడిపోవుట అనేది మనలను క్రిందికి పడవేస్తుంది. ముఖ్యంగా స్త్రీలమైన మనలో ఐక్యతా లేమి అనేది ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది.

మనం అనుకున్నట్లుగా దానంతట అదే ఐక్యత, సమాధానములు కలగవు కానీ దానికి కొంత ప్రయాసపడాలి, ప్రయత్నించాలి. కొన్నిసార్లు మన మాటలు, ప్రవర్తన, ముఖ కవళికలు, శరీర కదలికలు కుటుంబములోనూ, ఎదుటివారిలోనూ బాధని, ఇబ్బందిని కలిగించవచ్చు. అదే విధంగా ఎదుటి వారి ప్రవర్తన, మాటలు మనలను గాయపరచవచ్చు.

 **మనిషి ప్రేమతో కాకుండా ద్వేషంతో ఉంటే అతను రోగితో సమానం.**

ఎదుటి వారి భావములు మనకి ఇష్టంగా ఉండకపోవచ్చు. వీటన్నింటిలో మనము చేయవలసింది ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుట యందు శ్రద్ధ. అదే విధంగా ఎదుటి వారు, నా గురించే మాట్లాడుకుంటున్నారేమో? ఏమనుకుంటున్నారో అనే అపోహలు, అపార్థములు కూడా స్త్రీల మనసులో కలుగుతూ ఉంటాయి. ప్రతి చిన్న విషయమునకు వ్యతిరేక ఆలోచన కుటుంబములోనూ, తోటివారితోను ఉన్న సంబంధములను నష్టపరస్తుంది.

కనుక ఐక్యతను కాపాడుకోవడానికి కొన్నింటిని అనుసరించాలి, కొన్నింటిని విడిచిపెట్టాలి. మొట్టమొదటగా వ్యతిరేకంగా ఆలోచించడాన్ని విడిచిపెట్టాలి. ప్రతి విషయంలో అనుకూలంగా ఆలోచించడం ప్రారంభించాలి. అప్పుడు మన ఆరోగ్యమునకు, ఆత్మీయ జీవితమునకు మేలు. ఓర్పుతో సహించుకొని, క్షమించే మనస్సుని కలిగి ఉండాలి. ప్రతిఫలం ఆశించని ప్రేమను చూపుచూ, ఎదుటి వారికి మేలు చేయుట యందు విసుకక ఉండవలెను. మాటల విషయములో జాగ్రత్తని కలిగి ఉండాలి.

అపో. పౌలు రోమా 12:18 లో చెప్పినట్లుగా శక్యమైతే సమస్త మనుష్యులతో సమాధానం కలిగి ఉండడానికి ప్రయత్నించాలి, మనలను మనం తగ్గించుకోవాలి. ఆ స్వభావం లేక నేడు కుటుంబములు విచ్ఛిన్నం అవుతున్నాయి. మనలో ఏ ఒక్కరమూ కూడా ఇలాంటి స్థితిలోనికి వెళ్ళవద్దు. ఇతరులతో పోల్చుకొనుట అనేది కూడా ఐక్యతను దెబ్బతీసేదిగా ఉంటుంది. దేవునికి ఏ ఒక్కరూ ఎక్కువ కాదు, ఏ ఒక్కరూ తక్కువ కాదు, అందరినీ ఒకే విధంగా ప్రేమిస్తున్నారు. క్రీస్తు శరీరములో మనమందరము, ఒక్కొక్క అవయవము అని ఎరగాలి, శరీరములోని అవయవములన్నింటికి ఒక్కటే పని ఏ విధంగా ఉండదో, మనందరికి ఒక్కటే పని ఉండదు అని గ్రహించాలి. అలాగే ఒక అవయవము, మరియొక అవయవముతో ఏలాగు పోల్చుకొనదో, మనము కూడా దేవుడు అనుగ్రహించిన స్థితిని బట్టి సంతృప్తి చెందుతూ, ఐక్యతతో ముందుకి వెళ్దాము.

పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో అపో.పౌలు ఫిలిప్పీ సంఘమునకు ఉత్తరం వ్రాస్తూ ఇద్దరు సహోదరీలను బ్రతిమాలుచున్నాడు. **"ప్రభువు నందు ఏక మనస్సు గలవారై యుండుడని యువొదియను, సుంటుకేను బతిమాలుకొనుచున్నాను. – ఫిలిప్పీ 4:2**

ఇక్కడ ఇద్దరి స్త్రీల మధ్య ఉన్న వివాదమును సరిచేసుకొనమని పౌలు తన పత్రికలో వ్రాయడం జరిగింది. ఎందుకనగా ఇది వీరి మధ్య ఉన్న సంబంధమునే కాక, సంఘములో ఉన్న వారి ఐక్యతను చెడగొట్టి చీలికను కలిగించే అవకాశం ఉంది. కారణం ఈ స్త్రీలు సువార్త పరిచర్యలో పౌలుతో కూడా ప్రయాసపడిన వారిగా చెప్పుచున్నాడు. ఇంకను వారి మధ్య ఉన్న గొడవను తీర్చడానికి సహాయం చేయమని నిజమైన సహకారిని వేడుకుంటున్నాడు. మన దగ్గరకి ఇలాంటి విషయములు వస్తే, ఇద్దరి మధ్య సమాధానమును కలిగించి, ఐక్యతను

కాపాడే వారిగా ఉన్నామా? మనమే ఆ స్త్రీలలో ఒకరిగా ఉంటే ఎదుటి వారితో సమాధానపడడానికి ఇష్టపడుతున్నామా? తగ్గించుకోవడానికి, ప్రేమించడానికి, సహించుకోవడానికి, సమాధాన పడడానికి, శరీరము ఒప్పుకొనక వెనుకకు లాగుతూ ఉంటే పరిశుద్ధాత్మ దేవుని సహాయం కొరకు వేడుకొని, ఐక్యత కలిగి ఉండటానికి ప్రయాసపడదాము.

ప్రభువైన యేసుక్రీస్తు శరీరధారియై యున్న దినములలో ఆయన చెప్పినదేమనగా **"మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనిని గూర్చియైనను భూమి మీద ఏకీభవించిన యెడల అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరుకునని మీతో చెప్పుచున్నాను - మత్తయి 18:19**

ఐక్యతతో మనము ఏకీభవించి ప్రార్థించినప్పుడు, కుటుంబములోనైననూ, సంఘములోనైననూ తండ్రి వలన అది తప్పక మనకి అనుగ్రహించబడుతుంది. అసమాధానములు, ఆటంకములు అన్నీ విడిపించబడతాయి. నేటి దినములలో ఏది చేయడానికైననూ ఇష్టపడుతున్నాము కానీ, ఏకీభవించి ప్రార్థించే మనస్సు మాత్రం ఎక్కడా ఉండట్లేదు.

ఆది సంఘములో మేడ గదిలో తండ్రి వలన వినిన వాగ్దానము కొరకు కనిపెట్టిన శిష్యులతో పాటు స్త్రీలు కూడా ఉన్నారు. వీరందరూ కలిసి ఏకమనస్సుతో ఎడతెగక ప్రార్థన చేశారు. దేవుని నామము అనేకులకు తెలియపరచబడింది. అదే విధంగా దేవుని రాజ్య వ్యాప్తి కొరకు ప్రయాసపడిన వారిలో కూడా కొందరు స్త్రీలు ప్రార్థన ద్వారా, పరిచర్య చేయుట వలన, వారికి ఉన్నవి వ్యయపరచుటను బట్టి దేవుని నామము మహిమపరచబడింది.

ప్రియమైన వారలారా! మనము కూడా ఆయన నామమును మహిమ పరచుటలో, రాజ్య వ్యాప్తి కొరకు ప్రయాసపడుటలో సాధనములుగా ఉండాలని దేవుని ఉద్దేశ్యం.

దీని చదువుచున్న వారికందరికి అట్టి ధన్యత కలుగును గాక !

## ఉపవాస ప్రార్థన

**ఉపవాస ప్రార్థన - 2015, మే 1వ తేది (శుక్రవారం)**

ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.

ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

**వివరములకు:**

9666666249 | 040-24202227

# నోరు జారిన మాటలు

చాలా సంవత్సరాల క్రితము ఒక ఊరిలో చామంతి అనబడే ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి రోజంతా కబుర్లు చెప్పుకుంటూ, తను ఇక్కడి మాటలు అక్కడ, అక్కడి మాటలు ఇక్కడ చెబుతూ ఉంటే, చూసి వాళ్ళమ్మ చాలా బాధపడేది. ఇలా గాలి కబుర్లు చెప్పడం తప్పని అమ్మ ఎంత చెప్పినా చామంతి పట్టించుకునేది కాదు. ఒకరోజు సువార్త సభలు జరుగుతున్నాయని ప్రసంగం వింటానికి వెళ్లిన చామంతి తల్లి దైవజనునికి తన బాధను చెప్పుకుని, చామంతి వినటం లేదని, ఆమె తప్పు అర్థమయ్యేలా చెప్పమని కోరుకుంది. ఆయన ఉదయమే తన దగ్గరకు తీసుకొని రమ్మని చెప్పాడు. మర్నాడు పొద్దున్నే అమ్మ చామంతిని దైవజనుని దగ్గరకు తీసుకు వెళ్ళింది. ఆయన ఒక కోడిని చూపించి ఆ కోడి ఈకలు తీసి ఊరు మొత్తం జల్లమని చెప్పాడు.

అమ్మ చామంతిని కోడి ఈకలతో ఊరంతా చుట్టి రమ్మంది. చామంతి సంతోషంగా ఊరంతా తిరుగుతూ కనిపించిన వారందరికీ కబుర్లు చెపుతూ ఇక్కడో ఈక, అక్కడో ఈక విసిరేసింది. సాయంత్రం అమ్మ చామంతి దైవజనుని దగ్గరకు వెళ్ళి, ప్రసంగం జరుగుతంటే విన్నారు. "నోటి ఫలముచేత మనుష్యుడు మేలు ననుభవించును. తన నోరు కాచుకొనువాడు తన్ను కాపాడుకొనును. "ఊరకొనక మాటలాడు వాడు తనకు నాశనము తెచ్చుకొనును. విస్తారమైన మాటలలో దోషముండక మానదు. తన పెదవులను మూసికొనువాడు బుద్ధిమంతుడు." ప్రసంగం ముగించింది. ఈ రాత్రి నిద్రపోయి మళ్ళీ తెల్లవారగానే ఇద్దరినీ రమ్మన్నాడు. దైవజనుడు మర్నాడు పొద్దున్నే దైవజనుడు "నిన్నంతా విసిరిన కోడి ఈకలు వెతికి తీసుకురా చామంతీ" అని అన్నాడు. వెంటనే చామంతి ఊరంతా వెతకటం మొదలు పెట్టింది. సాయంత్రం దాకా ఊరిలో ప్రతిస్థలం వెదికినా ఒక్క ఈక కూడా కనిపించలేదు. దిగాలుగా చామంతి దైవజనుని దగ్గరకు వచ్చి, నన్ను క్షమించండి, నాకు ఒక్క ఈక కూడా దొరకలేదు" అని తలదించుకొని చెప్పింది.

చూశావా చామంతి! మన వ్యర్థమైన మాటలు కూడా ఆ ఈకలు లాంటివే, ఒక్కసారి నోరు జారితే ఆ మాటలను మనం యెన్నటికి తిరిగి తీసుకోలేము. "సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్లెములో ఉంచబడిన బంగారు పండ్ల వంటిది. నీవు ఇప్పటి వరకూ వ్యర్థమైన మాటల వలన సమయం అంతా వృధా చేసుకున్నావు. సమయోచితముగా మాట్లాడినచో నీకు మేలు కలుగును అని దైవజనుడు అన్నాడు.

ఆ రోజు నుండి చామంతి గాలి కబుర్లు చెప్పటం మానేసి అమ్మకి, ఇరుగు పొరుగు వారికి సంతోషకరంగా ఉంది. మరి మన మాటలు??



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 39వ భాగము**

ఒకానొక సందర్భములో దినమంతా నడిచి అలసిపోయి సాయంత్రానికి ఓ గ్రామం చేరాడు సుందర్. వర్షం కురవనారంభించింది. ప్రధాన వీధిలో సుందర్ వెళ్తుంటే ఆయనకి ఆతిథ్యమివ్వడానికి ఎంతో మంది ముందుకి వచ్చారు. అతడు ఒక హైంధవ సాధువు అని వారు అనుకున్నారు. అయితే అతడు యేసుప్రభువును గురించి చెప్పినప్పుడు ఎందరో బలవంతంగా ఆయన మీద లేచారు. వారు రౌద్రులై ఆయనను వెంటాడి తరుముచున్నప్పుడు గ్రామమును విడిచి పారిపోవడం తప్ప సుందర్‌కు వేరే గత్యంతరం లేకపోయింది. అలా పారిపోతూ తొట్రిల్లి పడిపోయాడు, వర్షం కురుస్తూనే ఉంది, ఆ వర్షములో తడిసి ముద్దయిపోయాడు. చివరిగా శిధిలావస్థలో ఉన్న ఒక గుడిసెను చూచి కొంచెం నీడ దొరికినందుకు దేవునిని స్తుతిస్తూ దానిలోనికి పరిగెత్తాడు. ఆ గుడిసెలోనికి వెళ్ళి కొంచెం విశ్రాంతి కోసం తల వాల్చగానే గాఢ నిద్రలోనికి వెళ్ళిపోయాడు. మెలకువ వచ్చేసరికి తెల్లవారుతూ ఉంది. కొంచెం కాళ్ళు చాచుకుందామని ప్రయత్నించిన సుందర్ తన ప్రక్కనే నేల మీద ఉన్న ఓ నల్లని ఆకారమును చూచి భయపడ్డాడు. ఆ మసక వెలుతురులోనే కొంచెం జాగ్రత్తగా చూచినప్పుడు తన దుప్పటి పైనే ఒక ప్రక్కన చుట్టచుట్టుకొని పడియున్న పెద్ద త్రాచుపామును చూచాడు. ఊపిరి బిగపట్టుకొని నెమ్మదిగా లేచి ప్రక్కకు తప్పుకొని ఒక్క ఉదుటున ఆ గుడిసెలో నుండి పారిపోయాడు. అయితే బయటకు వచ్చిన తరువాత తన దుప్పటి గుర్తుకు వచ్చింది. కొన్ని కొన్ని రాత్రిళ్ళు తాను వీధిలోనే గడపవలసి వస్తుంది. కనుక ఆ దుప్పటి తనకి ఎంతో అవసరము. కాబట్టి ఎంతో ఆసక్తితో ప్రార్థించగా ప్రభువు తన మెల్లని స్వరముతో "సుందర్ ! రాత్రంతా నేను నిన్ను కాపాడలేదా ? వెళ్ళి నీ దుప్పటి తెచ్చుకో !" అని గద్దించగానే సుందర్ వెనుకకు వెళ్ళి గుడిసెలో ప్రవేశించి ఎంతో జాగ్రత్తగా ఆ పెద్ద త్రాచు పాము క్రింద నుండి తన దుప్పటిని లాక్కున్నాడు. ఆ త్రాచుపాము ప్రక్కకు దొర్లిపోయింది. అది లేచి అకస్మాత్తుగా తనను కాటు వేస్తే, మరణం తప్పదని సుందర్‌కి తెలుసు, ప్రభువే ఆయనను కాపాడాడు.

మరోసారి హిమాలయ పర్వత చరియలలో ప్రయాణిస్తున్నప్పుడు ఎంతో దుఃఖములో ఉన్నట్లుగా కనబడుచున్న ఒకరు వచ్చి డబ్బు కావాలండీ అని అడిగి నేల మీద

 **నువ్వు నవ్వుకి యజమానివైతే నీ అనుమతి లేకుండా నిన్ను ఎవరూ బాధ పెట్టలేరు.**

పడియుండి బట్టతో కప్పియున్న తన స్నేహితుని చూపిస్తూ, అయ్యా నా స్నేహితుడు అకస్మాత్తుగా దారిలో చనిపోయాడండి ఇతనిని సమాధి చేయడానికి డబ్బు లేదండి అని విన్నవించుకున్నాడు. సుందర్ దగ్గర దుప్పటి, రెండు నాణెములు తప్ప మరేమీ లేవు. అయితే తనకి ఉన్నదంతా అతనికి ఇచ్చి వెళ్ళిపోయాడు. కొంచెం సేపటిలోనే ఆ వ్యక్తి గుండెలు బాదుకుంటూ, ఏడ్చుచూ సుందర్ దగ్గరకి వచ్చాడు. “అయ్యా! నా స్నేహితుడు చని పోయాడండి” అని ఘొల్లుమన్నాడు. సుందర్‌కి ఇదేమీ అర్థం కాలేదు. నీ స్నేహితుడు చనిపోయాడని నీవే చెప్పావు కదా అన్నాడు. అలా కాదండి, నా స్నేహితుడు ఇప్పుడు నిజంగానే చనిపోయాడండి అని చెప్తూ, ఇదంతా ఓ నాటకమని సంగతి అంతా చెప్పాడు. నేను, నా స్నేహితుడు ఒకని తరువాత మరొకరము చనిపోయినట్లుగా నటిస్తూ అమాయకులైన వారిని మోసగిస్తూ ఇలా వారిని దోచుకుంటున్నామని చెప్పాడు. ఇప్పుడైతే వారు ఒక పరిశుద్ధునికి అబద్ధం చెప్పారు. ఆయన డబ్బును దుప్పటిని వారు తీసికొన్నారు గనుక ఇది వారి మీదికి వచ్చిన దేవుని తీర్పు. కలవరపడిన ఆ వ్యక్తి నా స్నేహితుడు ఇప్పటికే చనిపోయాడు. నేను దోషినని ఎంతో బాధపడనారంభించాడు. పాపికి రావలసిన శిక్షను దేవుని కుమారుడైన క్రీస్తు ప్రభువు సిలువలో భరించాడు గనుక క్షమాపణ లేని పాపమేది లేదని అతనికి చెప్పాడు సుందర్. వీటిని స్వీకరించడానికి అతని హృదయం సంసిద్ధంగా ఉంది. దీని ఫలితంగా అతడు సుందర్‌తో కొద్ది దినములు గడిపి, తరువాత బాప్తిస్మం పొంది, క్రైస్తవుడయ్యాడు ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగక పోయినప్పటికిని సుందర్‌ను గూర్చిన సమాచారం ఎంతో మందికి తెలియనారంభించింది. కనుక ఆయా పట్టణములకు గాని, కొండ ప్రాంతములకు గాని వెళ్ళినప్పుడు ఆయనను కలిసికోవాలని ఎంతోమంది కనిపెడుతూ ఉండేవారు. సుందర్ ఢిల్లీలో ఉన్నప్పుడు ఆయన ఉండిన హాస్టలు గదికి వచ్చిన విద్యార్థులు ఆయన వలన ఎంతో ప్రభావితులై మారుమనస్సు పొందారు. వారిలో ఒకతను సంపూర్ణ క్రైస్తవ సేవలో ఉండుటకు గాను తాను చేయుచున్న మంచి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. మరొకతను లోకసంబంధమైన పనులన్నీ మానుకొని ఫాదరిగా తర్ఫీదు పొందడానికి నిర్ణయించుకొన్నాడు. వీరిద్దరే కాకుండ ఉన్నత కులమునకు చెందిన వానిగా యెంచబడిన మరో విద్యార్థి కళాశాల పనివారిలో ఒకరు జబ్బు పడ్డాడని తెలిసికొని అతడు అస్పృశ్యుడుగా ఎంచబడినప్పటికిని వారింటికి వెళ్ళి అతడు కోలుకునేంత వరకు ఉపచారం చేశాడు. ఇలాంటి సంఘటన ఆ కళాశాలలో అంతకు ముందు ఎన్నడూ జరగలేదు.

– సేకరించబడింది

(ఇంకా ఉంది)

# దైవచిత్తం

దేవుని చిత్తం తెలుసుకోవడానికి దేవుని ప్రజలైన వారి జీవితంలో ఎన్నెన్నో అభిప్రాయములు కలిగి ఉన్నారు. ఈ విషయంలో అనేకులు తీసుకున్న నిర్ణయములు నష్టదాయకమైనవిగాను, హేళన కరమైనవిగాను ఉండడం బాధాకరమైన విషయం. దేవుడు తన స్వరముతో మాట్లాడాడు, దర్శనం కనిపించింది, ప్రవచనంలో చెప్పారు, అంటూ వాస్తవ స్థితికి ఏమాత్రము సంబంధము లేకుండా పూర్తిగా తమ స్వంత ఇష్టా ఇష్టాలకి అనుగుణంగా ప్రవర్తించడం చాలా బాధాకరమైన విషయం. ఇది దేవుని ప్రేమ కలిగిన ప్రజలను ఎంతో వేదనకు గురిచేసే అంశము ఎందుకంటే దీని వలన వివాహముల విషయములో తప్పు నిర్ణయములు తీసుకోవడం. అంతమాత్రమే కాకుండా దేవుని సేవ, సేవ అంటూ యుక్తవయస్సులో బాధ్యతలను విడిచి పెట్టి సోమరితనంతో జీవించడం, దేవుడు చెప్పాడు అని దైవ వాక్యమునకు విరుద్ధంగా ప్రవర్తించడం ఇలా చెప్పుకుంటూ వెళితే ఇంకా ఎన్నో రుగ్మతలు మనకు కనిపిస్తాయి. వీటి పర్యవసానం, సామాన్యమైన మనుష్యులకు దేవుని మాట పట్ల పూర్తిగా నమ్మకంపోయే పరిస్థితి, దేవుని పనికి ఎంతో నష్టదాయకంగా ఉండడం. దీని విషయంలో క్రైస్తవులైన ప్రతి ఒక్కరు సరియైన జ్ఞానం కలిగి ఉండవలయును. అనగా దైవ చిత్తము అనేది ఎలా మనం తెలుసుకోవాలి? కలలు, దర్శనములు, ప్రవచనములు, స్వరములు దేవుని వలన కలుగుట ఎంత సహజమో, వీటిని అపవాది కూడా అంతకంటే ఎక్కువగా వాడుకోవడం నేటి దినములలో నగ్న సత్యము. **ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు. 2 కొరింథీ 11:14** కాబట్టి పై విధానములో దేవుడు మాట్లాడిన ప్రతి మాట వాక్యము ద్వారా పరీక్షించబడవలయును. **మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి. - రోమా 12:2**

దైవచిత్తమును గ్రహించి జీవించుటకు నాలుగు ప్రాముఖ్యమైన అంశాలను బైబిల్ గ్రంథములో నుండి మనము గ్రహించుదము.

1. దేవుని చిత్తము లేక ఉద్దేశ్యము తెలిసికొనుటకు దేవుని వాక్యము మనకు ఎంతో సహాయం చేస్తుంది. అదే సంగతి కీర్తనలు 119:105లో వ్రాయబడింది. **నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది.**

2. దైవ చిత్తాన్ని నెరవేర్చుటకు మన అంతరంగములో ఆయన ఆత్మ ద్వారా మనకు నడిపింపు అనుగ్రహించుట జరుగుతుంది. **కాగా నా ప్రియులారా, మీరెల్లప్పుడును విధేయులై**

 ఉన్నత వ్యక్తిత్వం కలిగి ఉంటే శత్రువు కూడా నిన్ను చూసి తలదించుకుంటాడు.

యున్నప్రకారము, నా యెదుట ఉన్నప్పుడు మాత్రమే గాక మరి యెక్కువగా నేను మీతో లేని యీ కాలమందును, భయముతోను వణకుతోను మీ సొంతరక్షణను కొనసాగించుకొనుడి. ఎందుకనగా మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే. ఫిలిప్పీ 2:12,13

దానితో పాటే పరిస్థితులు అన్ని కూడా సమకూర్చబడతాయి. **దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము. రోమా 8:28**

3. మనలను ఆత్మీయంగా నడపించే వారు లేక పెద్దల ద్వారా ఆయన చిత్తమును మనము తెలిసికొనుటకు అవకాశం ఉన్నది.

**వివేకముగల నాయకుడవై యుద్ధము చేయుము. ఆలోచన చెప్పువారు అనేకులుండుట రక్షణకరము. సామె 24:6,**

**బుద్ధిలేనివానికి మూఢత సంతోషకరము వివేకముగలవాడు చక్కగా ప్రవర్తించును సామె 15:21,**

**నాయకులు లేని జనులు చెడిపోవుదురు ఆలోచనకర్తలు అనేకులుండుట రక్షణకరము సామె 11:14**

కనుక దైవవాక్యానుసారముగా జీవించుటకు ప్రయత్నించే పెద్దలను మనము సంప్రదించుట అనగా దేవుని శరీరములో అవయవములుగా ఉన్నవారితో సహవాసమును కలిగి ఉండుట దైవ చిత్తము తెలిసికొనుటకు ఎంతో అవసరమై ఉన్నది.

4. దేవుడు తన చిత్తము నెరవేర్చుట ద్వారా మనకు హృదయంలో గొప్ప సమాధానము కలిగిస్తాడు.

**నీతి సమాధానము కలుగజేయును నీతివలన నిత్యమును నిమ్మళము నిబ్బరము కలుగును. అప్పుడు నా జనులు విశ్రమ స్థలమునందును ఆశ్రయ స్థానములయందును సుఖకరమైన నివాసముల యందును నివసించెదరు. యెషయా 32:17**

**క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండ నియ్యుడి; ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువబడితిరి, మరియు కృతజ్ఞులై యుండుడి కొలస్సీ 3:15**

వీటి ద్వారా దైవచిత్తము ఏదో, కానిది ఏదో ఎరిగి ముందుకు సాగిపోదాము. మనము తీసుకొనే నిర్ణయముల ద్వారా దేవుని నామమునకు అవమానం కలగకుండా, చూచుకొనవలెను. అంత మాత్రమే కాకుండా మన జీవితములలో నెమ్మదిగా క్షేమముగా జీవించుదుము.



# ఆశానిగ్రహం

హాయ్ పిల్లలు! చాలా టెన్షన్‌గా ఉన్నారేంటి? ఎగ్జామ్స్ టైం అనేనా??? ఈ టైంలో మీ పేరెంట్స్‌కి కూడా టెన్షన్! ఎగ్జామ్స్ ఎలా రాస్తారా అని మిమ్మల్ని బాగా ప్రిపేర్ చేయాలని వారి తపన. ఎందుకంటే వారికి తెలుసు మీ భవిష్యత్ ఎంతో విలువైనదని. అందుకే మిమ్మల్ని చదవమని అనేకసార్లు హెచ్చరిస్తూ ఉంటారు.

పిల్లలు, కొంత మంది పేరెంట్స్‌కి వారి పిల్లల్ని చదివించడం ఎంతో కష్టం తెలుసా! కుటుంబాన్ని పోషించుకోవడానికి చాలా కష్టపడవలసిన పరిస్థితులు...అటువంటి సమయంలో మీ స్కూల్ ఫీజ్‌లు, బుక్స్, డ్రెసెస్ ఇవన్నీ వారికి ఎంతో భారముగా ఉన్నప్పటికి మిమ్మల్ని బాగా చదివించి, మీ భవిష్యత్ ఆనందంగా ఉండాలని వారి బలమైన కోరిక.

పిల్లలూ! మీలో ఒక్కొక్కరికి ఒక్కొక్క పరిస్థితి ఉంటుంది. నాకు తెలుసు, మీలో చాలామంది బాగా చదువుకోవాలని ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవాలని చాలా కష్టపడతారు. అలాంటి వారు టెన్షన్ పడకుండా ప్రశాంతంగా ఎగ్జామ్స్ వ్రాయమని నా సలహా.....( మీ హెల్త్ కూడా కేర్ తీసుకోవాలి) మరికొందరేమో ఎగ్జామ్స్ దగ్గరకి వస్తున్నా ఏ మాత్రం టెన్షన్ పడరు. చదువు మీద శ్రద్ధ పెట్టరు, టైం పాస్ చేస్తూ ఉంటారు. తల్లిదండ్రుల మాట కూడా వినరు. తరువాత నష్టపోయేది వారే అని గ్రహించరు

కొందరికి బాగా చదువుకోవాలని ఉంటుంది. కానీ సరైన సదుపాయాలు లేక మధ్యలో చదువు ఆపవలసిన పరిస్థితులు...సరైన సలహాలు చెప్పేవారు లేక ఏమీ చేయలేని పరిస్థితులు అటువంటప్పుడు రాము ఏం చేశాడో చూద్దామా !.....

ఒక గ్రామంలో భీమన్న అనే పేదవాడు ఉండేవాడు. అతను తన జీవితం కొనసాగించడానికి ఉపాధి కోసం కుటుంబంతో సహా పట్టణానికి రావలసి వచ్చింది. భీమన్న కొడుకు రాము తను చదువుకునే బడిని, స్నేహితులను విడిచి పెట్టాలి కదా అని బాధపడ్డాడు.

పట్టణంలో భీమన్న ఒక వ్యాపారస్తుని ఇంట్లో తోటమాలిగా పనిలో చేరాడు. రాముని చదివించే స్థోమత లేక రోజూ తనతో పనికి తీసుకు వెళ్ళి, అక్కడి చెట్లకు నీళ్ళ

పోయించేవాడు, వ్యాపారస్తుని పిల్లలతో ఆడుకునే వాడు రాము.

ఒకనాడు వ్యాపారస్తుడు రామును గమనించి, అతడిని పిలిచి ఒక కవర్‌లో ఒక ఉత్తరం, 100 రూపాయలు పెట్టి తన పిల్లలు చదివే స్కూల్ మాస్టారి చేతికి ఇవ్వమని చెప్పాడు. సరేనని రాము బయలు దేరాడు. దారిలో పెద్ద పెద్ద దుకాణాలు చూసి ఆశ్చర్యపోయాడు. ఒక ఆటవస్తువుల షాప్ లో అందమైన బొమ్మలు గాజు కిటికీలలో అమర్చి ఉన్నాయి. వాటి వైపుకు రాము ఒకసారి చూశాడు. అందులో బొమ్మలు రాముతో "మమ్మల్ని కొను" అన్నట్లు చూస్తున్నాయి. రాముకు ఆశ్చర్యమేసింది. "నా దగ్గర డబ్బులు లేవు" అన్నాడు. ఆ ఆట వస్తువులు "నీ చేతిలో ఉన్న కవర్‌లో 100 రూ॥లు ఉన్నాయిగా" అన్నాయి. రామూకు ఆశగా ఉన్నా అలా చేయడం తప్పు అని తెలుసు. ఆ బొమ్మల మాట పట్టించుకోకుండా అక్కడి నుండి బడివైపు వెళ్లాడు. ఆ ఆట వస్తువుల మాటలు వినిపిస్తున్నా పట్టించుకోలేదు.

బడి చేరుకున్న రాము ఆ కవర్‌ని మాస్టారు చేతిలో పెట్టాడు. ఆ మాస్టారు "ఐతే నువ్వేనా మా బడిలో చేరబోయేది. ఇందులో అప్లికేషన్ ఫారం, ఇంకా రిజిస్ట్రేషన్ ఫీజు ఉన్నాయి" అన్నాడు. ఆ విధంగా జాయిన్ అయిన రాము చదువుకొని, గొప్ప ప్రయోజకుడయ్యాడు. రాము ఆనందానికి అవధులు లేవు. తను ఆ ఆటవస్తువుల మాట విని ఉంటే ఒక మంచి భవిష్యత్తు పొందే అవకాశం పోగొట్టుకునేవాడు కదా!

చూశారా పిల్లలూ! ఎగ్జామ్స్ టైం లో మీరు కూడా మీ మనస్సుకు నచ్చినట్లు చేస్తే....ఫ్రెండ్స్ అని ఫేస్‌బుక్ అని టి.వి చూడటం, వీడియో గేమ్స్ ఇలా టైం వేస్ట్ అయిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఈ టైంలో కొన్నిటిని ప్రక్కన పెట్టి శ్రద్ధగా చదవటానికి నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే మంచి మార్కులు సాధించగలుగుతారు. ఆటలకి కొన్నిరోజులు బై చెప్పి, ఎగ్జామ్స్ అయ్యాక ఆడుకుంటాననే మంచి నిర్ణయం తీసుకోవాలి. రామూని చూడండి, ఆటవస్తువులను కొనుక్కొని ఉంటే తనకు వచ్చిన మంచి అవకాశం కోల్పోయేవాడు కదా! గ్రామంలో ఆగిపోయిన తన చదువుని, సరైన నిర్ణయం తీసుకోవటం వలన పట్టణంలో చదువుకొనే అవకాశం కలిగింది. నిర్ణయం చిన్నదిగా కనిపించినా, దాని ఫలితం ఎంతో గొప్పది అని మనం గ్రహించాలి. అంతే కాదు తన యజమాని అప్పగించిన పనిని శ్రద్ధగా చేశాడు అది తనకే మేలును కలిగించింది. ఆ విధంగానే మీరు ఇప్పుడు శ్రద్ధగా చదువుకుంటే ఒక మంచి భవిష్యత్తును కలిగి ఉంటారు. All The best పిల్లలూ !

ప్రేమతో మీ అక్కయ్య

# నా జీవితంలో దేవుని మేలులు

**కె.వెంకన్న, వరంగల్**

నా పేరు కె. వెంకన్న (క్రీస్తుదాస్). నా బాల్యంలో ఒక సంవత్సరం స్కూలుకి వెళ్లాను. తరువాత కొన్ని కారణముల వలన స్కూలు మానేసి, గొర్రెలు కాయడం జరిగింది. మరల 13 సం॥ల వయసులో స్నేహితుని ద్వారా రాత్రి బడికి వెళ్ళి 3వ తరగతి వరకు చదువుకున్నాను. చిన్న వయసులోనే చుట్ట, బీడి, సిగరెట్, కల్లు, సారా త్రాగుచూ స్నేహితులతో కలసి, సినిమాలకు వెళ్ళుచూ ఇష్టం వచ్చినట్లుగా తిరిగే వాడిని. ఈ సమయములో మా ఊరిలో కరుణామయుడి సినిమా ప్రదర్శించారు. అది చూచి నా హృదయములో యేసుక్రీస్తు మంచిదేవుడు అనే అభిప్రాయం కలిగింది. ఆయనను నమ్ముకోవాలని అనుకున్నాను. నా స్నేహితుని దగ్గర దేవునిని గురించిన పత్రిక చదివాను. దానిలో ఎఫెసి 2వ అధ్యాయము 1-10 వరకు ఉన్న వాక్య భాగము నన్ను ఆలోచింపచేసింది. ఆయన మార్గములో నడవాలని ధృఢంగా నిశ్చయించుకున్నాను. కొన్ని రోజుల తరువాత తేలు కుట్టింది. అప్పుడు ఒకతను వచ్చి ప్రార్థన చేస్తే వెంటనే తగ్గుతుంది అని చెప్పాడు. మంత్రాలు వేసినా తగ్గదు కదా ప్రార్థనకు ఎలా తగ్గుతుంది? అన్నాను. అప్పుడు అతను ఏడ్చుకుంటూ అక్కడికి వెళ్ళిన వారు నవ్వుకుంటూ తిరిగి వస్తారు అని ప్రార్థన చేసేవారి దగ్గరకు నన్ను తీసుకువెళ్ళాడు. వాళ్ళు ప్రార్థన చేశారు, మంట తగ్గిపోయింది, నాలో ఉన్న భారము అంతా తొలగిపోయి, సంతోషం కలిగింది. ఇది నా జీవితములో మరిచిపోని రోజు. యేసుప్రభువు వద్ద నా పాపములను ఒప్పుకొని, స్వంత రక్షకునిగా ఆయనను అంగీకరించి, నా అలవాట్లు అన్నీ మార్చుకొని, బాప్తిస్మము పొందాను. తరువాత కరెంటు మెయిన్ లైన్ తీగలు తగులుకొని, మరణం చెందవలసిన నన్ను కాపాడాడు. 1990వ సంవత్సరములో దేవుని విశ్వసించాను. 1992లో వివాహం జరిగింది. ఆ తరువాత కొన్ని కారణముల వలన, కొన్ని దినములకే విడిపోవడం జరిగింది. అప్పటి నుండి వివాహం చేసుకోకుండా తల్లిదండ్రులతో ఉండిపోయాను. నా విషయములో తల్లిదండ్రులు ఎంతో బాధపడేవారు. కొన్ని సం॥ల తరువాత నా తల్లి తండ్రి ఇద్దరు చనిపోయారు. వ్యవసాయం చేసుకుంటూ, వేరొక సహవాసములో సేవ చేస్తూ ఉండేవాడిని. ఆ విధంగా 9 సం॥లు చేసిన తరువాత 2007లో బైబిల్‌లో ఉన్న వాక్యమునకు, నడిపించే వారి సేవా పద్ధతులకు ఏ మాత్రం పొంతన లేకపోవడం చూచి, విసుగు చెంది ఇలాగు సేవ చేయడం కంటే యధార్థంగా విశ్వాసిగా ఉండడం మేలని, సేవ మానేసి వ్యవసాయం చేసుకుంటూ ఉన్నాను. 2008లో ఎపఫ్రా అన్నయ్య మీటింగ్స్ తీసుకువెళ్ళి, సూర్యాపేటలో జరుగుచుండగా ఒక సహోదరుడు ఆ మీటింగ్స్‌కి తీసుకువెళ్ళాడు. దైవసేవకులకు

పరిచయం చేశాడు. ఆ దినం దైవసేవకుల ద్వారా దేవుడు మాట్లాడిన మాటలు, తరువాత పరిచర్యలో, సేవలో ఉన్న క్రమం గురించి దైవసేవకులు నాతో మాట్లాడినప్పుడు అవి నన్నెంతో బలపరిచాయి. మినిస్ట్రీస్‌లో జరిగే సేవకుల కూడికకు రమ్మని చెప్పారు. వెళ్ళిన తరువాత నా గురించి తెలుసుకొని వివాహం చేసుకోకుండా ఇంతకాలం ఎందుకు ఉన్నావు? ముందు వివాహం చేసుకోమని, తల్లిదండ్రుల కంటే ఎక్కువ బాధ్యతను వహించి, వివాహం జరిగించారు. మరల 2009లో దేవుని దయ వలన ఎపఫ్రా మినిస్ట్రీస్‌లో వివాహం జరిగింది. ఇద్దరు కుమార్తెలను దేవుడు అనుగ్రహించారు. ఒంటరిగా ఉన్న నాకు దేవుడు ఒక కుటుంబమును ఏర్పరచి, గృహం కట్టుకోవడానికి కృపను చూపారు. 2012వ సం॥ మా వదిన మా పెద్ద పాపను ఎత్తుకొని, సూర్యాపేటలో రోడ్ దాటుచుండగా ట్రాక్టర్ క్రింద పడిపోయారు. కాళ్ళ మీద నుండి ట్రాక్టర్ వెళ్ళిపోయింది గానీ, పాపకు మా వదినకు ఎలాంటి దెబ్బలు తగలకుండా, కాపాడి, మరణం నుండి తప్పించారు. ప్రస్తుతం నేను ఎపఫ్రా మినిస్ట్రీస్‌లోనే ఉండి జి.కొత్తపల్లి ముకుందాపురం మామిడిపల్లిలో సేవ చేస్తూ ఉన్నాను.

నా కుటుంబం అంతా చివరి శ్వాస వరకు దేవునిలో నమ్మకముగా ఉండునట్లు మా కొరకు ప్రార్థించగలరు.

### ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భార్గవలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

**విన్నపము మరియు పట్టుదల**

ప్రతిచోట, ప్రతి ఒక్కరికి ఏదో ఒకటి కావలెనని అనిపిస్తుంది. పూర్తిగా సంతృప్తి పొంది, ఏ కోరికా లేకుండా ఉన్న వ్యక్తిని కనుగొనుట చాలా కష్టం. దేవుని యొద్ద నుండి మనకి ఏదైనా కావలసినప్పుడు, మనం దానిని అడగవలసి యున్నది. మన కోరికను అడుగుచూ చేయు ప్రార్థనను విన్నపము అంటారు. అటువంటి ప్రార్థన ప్రాముఖ్యమై యున్నది. ప్రార్థన ద్వారా ఆయనతో భాగస్వామ్యం పొందుతాము. ఆత్మీయ జీవితములో దేవుని ద్వారా పనులను జరిగించుటకు ప్రార్థన ఎంతో తోడ్పడుతుంది. ప్రార్థన అనేది పరలోకపు శక్తిని భూమి పైకి తీసుకువస్తుంది.

కొన్నిసార్లు మన ప్రార్థనకు జవాబు త్వరగా వచ్చినట్లుంటుంది, కొన్నిసార్లు జవాబు ఆలస్యం అయినట్లుగా ఉంటుంది. ఈ సమయములోనే దేవుడు స్పందించే వరకు స్థిరత్వం కలిగి ప్రార్థించాలి. ఈ విధంగా ప్రార్థించే ప్రార్థనలను పట్టుదల కలిగిన ప్రార్థనలు అంటారు. మనం మొదటిసారి ప్రార్థించినపుడు దేవుడు వినడు అని కాదు గానీ ఆయన మన విశ్వాసమును పెంపొందించి, ఆత్మీయ జీవితములో బలం తెచ్చుకొనుటకు, మనం ప్రార్థన ద్వారా ఓర్పు నేర్చుకొనుచుండగా పట్టుదల కలిగి ప్రార్థించుటకు మనలను నడిపిస్తాడు.

మనం పట్టుదల కలిగి ప్రార్థించాలి ఎందుకనగా మరొక కారణం ఏమిటంటే – దురాత్మలు మన ప్రార్థనల జవాబులను అడ్డుకొనవచ్చును. దీనికి ఉదాహరణను దానియేలు 10వ అధ్యాయము నందు దానియేలు తన జవాబు కొరకు 21 దినములు ఉపవాసముండి ప్రార్థించిన వేళలు చూడవచ్చు. కాని ఒక దురాత్మ, పారసీకుల రాజ్యాధిపతి దానిని అడ్డుకుంటున్నాడు. దానియేలు విడువక ప్రార్థించుట కొనసాగింపగా దేవుడు ప్రధాన దూతయైన మిఖాయేలును పంపించి విజయమునిచ్చాడు. దానియేలు తన జవాబును దేవుని యొద్ద నుండి పొందుకున్నాడు. మనం మన కోరికలను ఆయనకు తెలియజేస్తూ విన్నపము చేసుకోవాలి. మరియు అవి భూమిపై ప్రత్యక్షమగు వరకు ప్రార్థనలో పట్టుదల కలిగి యుండాలి. ప్రభావవంతమైన ప్రార్థనా జీవితమునకు ఈ రెండు విధములైన ప్రార్థనలు అవసరము, ఆవశ్యకమై యున్నవి.

మనకు కావలసిన, అవసరమైన వాటిని దేవుని అడిగినప్పుడు, మనం మనవి చేస్తూ ప్రార్థిస్తున్నాము. మరియు యేసు మనకు ఈ విధంగా చెప్పారు. 'అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును" మత్తయి 7:7 ఎవరూ తట్టకపోతే ఏ తలుపు తీయబడదు. ఎవరూ వెదకకపోయినట్లయితే ఏమీ దొరకదు,

ఎవరూ అడగకపోయినట్లయితే ఎవరూ ఇవ్వరు.

మనం పొందుకొనునట్లుగా అడగాలి గనుక మన మనవులు చాలా ముఖ్యమైనవి. మనం దేవునిని మన కోరికలు అడుగుతున్నప్పటికీ, అవి మన స్తుతులు, కృతజ్ఞతలను మించినవై యుండకూడదు. "దేనిని గూర్చియు చింతింపకుడి గాని, ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" అని ఫిలిప్పీ 4:6లో చెప్పబడిన మాటను జ్ఞాపకం చేసుకుందాము. మన కోరికలను దేవునికి తెలియజేయుట అనేది మన స్తుతులతోను, కృతజ్ఞతలతోను సమతుల్యంగా ఉన్నప్పుడు దేవునికి మనవి చేయుట అనేది అత్యద్భుతంగానూ, ఉత్సాహభరితంగానూ ఉంటుంది. దేని గురించి అయిననూ దేవుని అడగడం, ఆయన అది చేస్తాడని నమ్మడం, ఆయన దానిని మన జీవితములలో చేయుచుండగా చూడడం అనేది చాలా అద్భుతంగా ఉంటుంది. ఆయన మనకు జవాబు ఇచ్చాడని, మరల ఆయనను అడగనవసరం లేదని హృదయములో తెలుస్తుంది, లేక మనం పట్టుదల కలిగి ప్రార్థించాలని అనిపిస్తుంది. ఆయన తన జ్ఞానముతో, తన సమయములో, తన మార్గములో మనకు జవాబివ్వడానికి ఇష్టపడుతున్నాడు. కాబట్టి సాగిపోయి అడిగే వారిగా ఉందాము.

**మన సుత్తులతోను, కృతజ్ఞతలతోను సమతుల్యంగా ఉన్నప్పుడు, దేవునికి మనవి చేయుట అనేది అత్యద్భుతంగాను, ఉత్సాహ భరితంగాను ఉంటుంది.**

(-సేకరించబడినది, ఇంకా ఉంది)
(జాయిస్‌మేయర్)



# ఆహారపు అలవాట్లు, శరీర పోషణ



శరీరం గురించి తగినంత శ్రద్ధ తీసుకోకపోతే అనారోగ్యం ప్రాప్తిస్తుంది. ఇది జరిగినప్పుడు శరీరమునకు భౌతిక స్వస్థత కావాలి. అంతే కాక ఇకపై శరీరమునకు తగిన సంరక్షణ, భద్రత ఉండే విధంగా కొన్ని చర్యలు కూడా అవసరం. తినే ఆహారం, త్రాగే నీరు, పీల్చేగాలి కలుషితమైన సమాజములో మనం జీవిస్తున్నాము కనుక ఆహారపు అలవాట్లు, మరియు ఆరోగ్య సూత్రముల గురించి తప్పక మనం తెలుసుకోవలసిన అవసరం ఉన్నది.

ఒక వ్యక్తి పోషకాహార లోపం వలన అంటే సరియైన తిండి లేక బాధపడుతున్నాడనుకొండి దీనికి ఒకటే మందు, ఆహార పరిస్థితి మెరుగుపడాలి. ఎవరికి చేతనైనంత మేరకు వారు తాము తీసుకునే ఆహారం సమతూకంగా పోషక విలువలు కలిగి, మంచి ఆరోగ్యమునకు అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లతో కూడి ఉండేలా చూచుకోవాలి. కరువు పరిస్థితులలో మనుష్యులు ఆరోగ్యంగా ఉండేందుకు కావలసిన వైవిధ్యం కలిగిన ఆహార పదార్థాలు లభ్యం కావడం అసాధ్యమవుతుంది. అయితే ఆహారం పుష్కలంగా దొరికే వారు సైతం, పోషకాహార విలువల గురించి కొన్నిసార్లు పట్టించుకోరు.

సరైన తిండి తినేందుకు డబ్బు ఖర్చు పెట్టడానికి ఎంతో మంది వెనకా ముందు ఆలోచించి, పిసినితనముతో జీవిస్తూ, మన తాహతుకు మించిన పని అని సమర్థించుకుంటారు. మన సమాజములో వెండి బంగారములకు ఉన్నంత విలువ కూడా సరియైన ఆహారమునకు లేకపోవడం శోచనీయమైన విషయం. దురదృష్టవశాత్తు అలాంటివారు అనారోగ్యముల పాలైతే ఆస్పత్రులకు, డాక్టర్లకు, మందులకు డబ్బు ఖర్చు పెట్టడమే కాక మానసికంగాను, శరీరపరంగాను ఎంతో బాధను అనుభవించవలసి వస్తుంది. దీని కంటే సరియైన ఆహారం కోసం ఖర్చు పెట్టడం ఎంతో నయం.

1. పోషకాహారం :- మంచి ఆరోగ్యం ఉండాలంటే మానవ దేహమునకు 4 రకాల ఆహార పదార్థములు అవసరం

అ. ప్రొటీన్లు :- చేపలు, కోడిమాంసం, చిక్కుళ్ళు మరియు పప్పులు

ఆ. కూరగాయలు :- కేరెట్లు, ఆకుకూరలు, బఠాణీలు, మొక్కజొన్న, మొలకెత్తిన

పప్పుధాన్యములు, బంగాళదుంపలు అందుబాటులో ఉన్న కూరగాయలన్నీ ప్రతిరోజూ మన ఆహారంలో భాగంగా చూసుకోవాలి.

ఇ. పండ్లు :- నారింజ, ద్రాక్ష, ఆపిల్, టొమేటో, మామిడి, అరటి, అనాస తదితర పండ్లు ఒకటి లేక రెండు ప్రతి దినం

ఈ. ధాన్యములు :- గోధుమ, బియ్యం బార్లీ, మొదలైనవి (తెల్లగా మరపట్టిస్తే పోషక పదార్థములన్నీ పోతాయి. సాధ్యమైనంత వరకు ఇవి గోధుమ వన్నెలోనే ఉండాలి). ధాన్యం నుండి తయారు చేసిన పదార్థములు ఉదా: రొట్టె మరియు అన్నము కనీసం రెండుసార్లు

## 2. అలవాట్ల శుభ్రత :-



మరోవైపున అవసరమునకు మించి తినడం లేక అనవసరమైన పదార్థములను అతిగా తినడం ద్వారా తమ ఆరోగ్యమును పాడు చేసుకునేవారూ ఉన్నారు. కొవ్వుపదార్థములు, పిండి పదార్థములు తింటారు. శక్తికి బదులు శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఇలాటి వారు స్థూలకాయులౌతారు. అందువలన ఆరోగ్యం దెబ్బ తింటుంది.

ఈ రోజులలో చాలామంది “తమ పళ్ళతో తమ గొయ్యి తామే తవ్వుకుంటున్నారు” అనే మాట నిజం అవుతున్నది. వారి ఆహారపు అలవాట్లు అనారోగ్యమును, శీఘ్రమరణమును తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి విషయములలో క్రమశిక్షణ అవసరం. మన దేహములు ఇక మనవి కావు. వెల ఇచ్చి కొనబడినవి. ఇప్పుడు అవి దేవునికి చెందినవి. వాటిని జాగ్రత్తగా చూచుకోవడం ద్వారా మనం దేవునిని మహిమపరచాలి **విలువ పెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి (1 కొరింథీ 6:20)**

అలాగే సరియైన పరిశుభ్రత కూడా అవసరమని గుర్తుంచుకోవాలి. శరీరమును శుభ్రం చేసుకోవడం తినే పాత్రలను శుభ్రంగా ఉంచుకోవడం తప్పనిసరి. మిగిలిపోయిన ఆహార కణములపై రోగ క్రిములు పెరుగుతాయి. **“దైవభక్తి తరువాత అంతటి స్థానం పరిశుభ్రతది”** అనే సామెతలో చాలా నిజం ఉంది. రోజుకి కనీసం ఒకసారి చక్కగా స్నానం చేయాలి అన్నది మంచి నియమం. **“అప్పుడు నేను నీళ్ళతో నిన్ను కడిగి” - యెహె 16:9, నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారమునై యుండి విశ్వాస విషయమై సంపూర్ణ నిశ్చయత గలిగి ..... హెబ్రీ 10:22**




# బైబిల్ క్విజ్ -39

**(ద్వితీయోపదేశకాండము నుండి ఇవ్వబడినవి)**

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

**1.** దేవుడు ఇశ్రాయేలీయులకు స్వాస్థ్యముగా ఇచ్చిన కనాను దేశాన్ని మోషే ఎక్కడ నుండి చూశాడు?

**2.** ఆహారాన్ని, నీళ్ళను కొనడానికి దేవుడు ఏ ప్రజల యొద్దకు ఇశ్రాయేలీయులను నడిపించాడు?

**3.** జ్ఞానుల కన్నులకు గుడ్డితనం, నీతిమంతుల మాటలకు అపార్థం పుట్టించునదేమిటి?

**4.** ఏ జంతువు మూతికి చిక్కము వేయవద్దు?

**5.** సీయోను కొండకు గల మరో పేరు ఏమిటి?

**6.** పారాను కొండ నుండి ప్రకాశించినదెవరు?

**7.** ఇశ్రాయేలులో ఏ గోత్రానికి భాగం లేక స్వాస్థ్యం లేదు?

**8.** 'అతడు యెహోవాకు ప్రియుడు' అనే ప్రశంసను పొందుకున్నదెవరు?

**9.** ఉప్పు సముద్రానికి ఉన్న మరో పేరు ఏమిటి?

**10.** యెహోవాను ముఖాముఖిగా ఎరిగిన ప్రవక్త ఎవరు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే 2015 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 38 జవాబులు (సంఖ్యాకాండము) :</u>**

**1**. పదిమారులు 14:22
2. ఫీనెహాసు 31:6
3. లేవీయులు 18:26
4. నమ్మకమైనవాడు 12:7
5. నాజీరు వ్రతము చేసేవారు 6:1-5
6. అహరోను, మిర్యాము 12:1
7. కోరహు, అతని సంబంధులు 16:31,32
8. 6, యాదృచ్ఛికంగా హత్యానేరం చేసిన వాళ్లని రక్షించడానికి 35:6
9. అహరోను 16:48
10. నలుబది దినములు 13:25

**<u>బైబిల్ క్విజ్ - 38 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

త్రినాధ్‌రావు, సీత, విఠల్, జాన్‌పాల్, షీబా, అశోక్, ఎస్తేరు, సుశీల, రిబ్కా, రూతు, కవితా మాధురి, సుధారాణి, మాధవి, తులసి, వాసవ్య, ఐజాక్ కుమారి, సుధాకర్

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి – ఏప్రిల్

**భాగ్యలత :** పుష్పలత, రాజేశ్వరి, వసుంధర, శ్రీవిద్య, స్వప్న, ప్రాముఖ్య, పద్మ, కోటేశ్వరి, రత్నాకర్, గోపీనాథ్, తిమోతి, జ్యోతి, మోజెస్, దీపిక, లత, యేసమ్మ, విక్రమకుమార్, సుమలత, నాగమణి, పీటర్, విస్మయ్, ఏలియా, బందేష్, సుజాత, సలోమియ, వినోద్, సుష్మ, రూతు, గీత, బ్యూలా, రాహుల్, గగన్, మేఘ, సాత్విక, హరీష్‌బాబు, రజని, సుహాసిని, హెప్సిబా, జయమ్మ, కృపారాణి, సిద్ధమ్మ, సువర్ణరత్న మంజరి, పుష్పావతి, రిష్విన్ రాజు, కీన్ అశ్విన్, యోజస్వి, షారోన్, అభినయశ్రీ, అభినయ, భోయజు, శ్రీవాణి, వెంకట రమణ, సురేష్, కళ, గోపీచంద్, తేజ(మిర్యాలగూడ) నాగేష్, పార్వతి ఎస్తేరు, అరుణ, కిరణ్, జయశీల, రజిత, ప్రియాంక, నోయాగ్రేస్, నిరీక్షణ, సాగర్, తేజ, సజ్జనామృత, పద్మ, సుమన్ విజయకుమారి, కృష్ణవేణి, సింధూర, కృపారావు, లలితాసాయి, జిన్నిబాబు, ఎలీషాబాబు, నరసింహరావు, అనూష, సూచన, జయ, బాలచంద్ర, ప్రసన్న, శేషగిరిరావు, మణమ్మ, అభిషేక్, నోయా, విశ్వాస్, పర్ణిక, ఆషా, గంగేయుడు, జాన్‌విక్టర్, విజయ, వర్షిణి, పద్మ, శ్రీనివాసరావు, శ్రీదేవి, గ్రీష్మ, గోపాల్, రాజు, మధురిమ, మాధురి, జీవన్, దీపిక, కెజియా, బేబి శ్యామల, కృష్ణవేణి, పాధ్విక

**చింతల్ :** రాజేష్, జాయానంద్, బాలరాజు, రాణి, శ్రీకాంత్, స్నేహ, శాంతిప్రియ, విజయ్, రాధామణి, సూర్యదీపిక, శిరీష, జీవన్‌కుమార్, హేమకుమారి, సురేంద్ర, అనంతరావు, సుధాకర్, మైఖేల్, డేవిడ్, రాజామన్నార్, విజయ.

**అనాజ్‌పూర్ :** శ్రావణి, ప్రభుదాస్, పీటర్, రమేష్‌బాబు, పాల్‌రాజు, స్వాతి, ఆరాధన, డేవిడ్, రూతు, కృపావరుణ్, ఆనందరావు, మరియమ్మ, ఎస్.కె.కరీమున్, ధనలక్ష్మి

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# మంచి శుక్రవారము

మనము ప్రతి సంవత్సరము యేసుప్రభువుని సిలువ వేసిన రోజుని గుడ్‌ఫ్రైడే అని చెప్ప కుంటూ, ఆచరించుట జరుగుచున్నది. గుడ్‌ఫ్రైడే అనగా మంచి శుక్రవారము. గుడ్‌ఫ్రైడేని పరిశుద్ధ శుక్రవారము, శుభశుక్రవారము, గొప్ప శుక్రవారము అని కూడా పిలుస్తూ ఉంటారు. ఆయనని సిలువ వేసిన ఆ రోజును మంచి శుక్రవారమని ఎందుకు అంటారు? అనే ప్రశ్న అనేకులకు కలుగుతూ ఉంటుంది.

అనాది కాలం నుండి మానవుడు తాను చేసిన ప్రతి పాపములకు, అపరాధములకు బదులుగా పాపపరిహారార్థ బలిగా, అపరాధ పరిహారార్థ బలిగా గొర్రెల యొక్కయు, మేకల యొక్కయు రక్తమును అర్పించి, ఆ పాపములను పరిహరించుకునే వారు. తరువాత మరల పాత జీవితమునే జీవిస్తూ ఉండేవారు. ఈ విధముగా పాపము చేయుట, దేవుని సన్నిధిలో బలులు అర్పించుట, మరల పాపము చేయుట చాలా సాధారణముగా మారిపోయినది.

సృష్టికర్తయైన ఆ దేవాధి దేవుడు దీనిని చూచి, సర్వమానవాళి పాపశిక్ష అంతా కొట్టి వేయ బడుటకు తన కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపనుద్దేశించెను. సర్వ మానవాళి పాపము పోవాలంటే నిర్దోషమైన, నిష్కళంకమైన రక్తము మాత్రమే చిందింపబడాలి.

మంచి శుక్రవారము, శుభశుక్రవారము అని పిలువబడే ఈ గుడ్‌ఫ్రైడే ఇంచుమించుగా 2000 సంవత్సరాల క్రితం ఒక శుక్రవారం దినమున జరిగిన యధార్థ సంఘటన. ఆ దినము యేసుక్రీస్తును కొరడాలతో కొట్టి, సిలువ ఆకారము కలిగిన కొయ్య మీద ఆయన జీవించి ఉండగానే, రెండు చేతులను, కాళ్ళను మేకులతో బంధించారు. ఈ భూమి మీద మనుష్యుడు చేసిన ప్రతి పాపమునకు యేసుక్రీస్తు ద్వారా మాత్రమే క్షమాపణ కలుగును. ఎందువలననగా ఆయన ఒక్కడే సిలువ మీద వ్రేలాడి, రక్తమును చిందించి, ప్రాణమును ఇచ్చిన మంచి కాపరి.

మనము ఏ కులమైనా, మతమైనా, ధనికులమైనా, పేదలమైనా ఈ సిలువ కార్యమును హృదయములో విశ్వసించి, నేను పాపిని ప్రభువా అని నోటితో ఒప్పుకొనుట ద్వారా ఆయన మనలను క్షమించి నీతిమంతులుగా చేస్తారు. తద్వారా కలిగే శాంతి, సంతోష, సమాధానములు చెప్పటానికి శక్యము కానివి. అంతమాత్రమే కాకుండా, సిలువపై ఆయన చేసిన ఈ పుణ్యకార్యమును విశ్వసించి, పాపక్షమాపణ పొందిన ప్రతివారు నరకము నుండి తప్పించబడి, మోక్షములో అనగా పరలోకరాజ్యములో చేర్చబడతారు. అందుకే గుడ్‌ఫ్రైడే శుభశుక్రవార మయ్యింది.

ఈ పత్రిక చదువుతున్న ప్రతి ఒక్కరు గుడ్‌ఫ్రైడే అంటే క్రైస్తవులది మాత్రమే అని తలంచక ఇంత మంచి మార్గములో మనము ఎందుకు నడవకూడదని ఆలోచించి, యేసు ప్రభువు మార్గములో నడచుట వలన మీకు దీవెన కలుగును.



**మిమ్ములను, మీ కుటుంబములను దేవుడు ఆశీర్వదించును గాక !**

# అన్నామణి

ఐర్లాండ్ దేశములోని మార్కెట్ హిల్ అను పట్టణమునకు సమీపమున నున్న బల్లమకల్లి అను మారు మూల గ్రామము నందు 1810వ సం॥లో **అన్నామణి** ఆరు మంది సంతానములో మూడవ దానిగా జన్మించెను. ఈమె తండ్రి జేమ్స్‌ప్రెస్టన్. ఈయన పొలములో బంగాళదుంపలు పండించుచూ, పందుల మందను కాయుచు శక్తి వంచన లేకుండా ప్రయాసపడుచుండెడి వాడు. ఈమె నీమెమెక్ అను ఆమె ఇంట పని చేయుచూ, దైవభక్తి కలిగిన వారి సహవాసమును కలిగి ఉండెను. ఆర్మ్‌స్ట్రాంగ్ హోలిడే అను ప్రసంగీకుని ప్రసంగము ద్వారా జీవితమును మార్చుకొని, దేవుని కృప కొరకు ప్రార్థించెను. పిమ్మట దేవుని యొక్క సిలువ దర్శనము ద్వారా రక్షించబడి అనుభవ సాక్ష్యమును అందరితో పంచుకొను చుండెను. అక్షరములు కూడా రాని బలహీనురాలైన ఆమె దేవుని సహాయం ద్వారా మొట్టమొదటిగా బైబిలు చదివెను. శరీరమందును, మనస్సునందును, ఆత్మయందును పరిశుద్ధపరచబడుటకు అపేక్షను కలిగి, ముఖ్యముగా సులువుగా చిక్కుల బెట్టు పాపములైన కోపము, మత్సరము, క్రోధము వంటి వాటి నుండి జయించుటకు పోరాటమును కలిగి ఉండెను. ఈమె దేవుని వాక్యానుసారముగా జీవించుచూ ప్రతీ విషయమునకు దేవుని సహాయమును కోరుచూ ఉండెను.

అన్నామణి తన యౌవన కాలములో పరిశుద్ధముగా జీవించునట్లుగా ఆత్మ వలన శరీరమును లోపరుచుకొనెను. అనేక పర్యాయములు దుష్టులు ఆమె కన్యత్వమును దోచుకొనవలెనని ప్రయత్నించిననూ దేవదూతలు వచ్చి ఆమెను రక్షించినారాన్నట్లు ఆమె తప్పించబడుచుండెను. ఈమె తన సాక్ష్యమును ప్రసంగముల కంటెను, తన జీవితము ద్వారా ఎక్కువగా బోధించెను. ఈమె సంఘనాయకులకు, పాదుర్లకు సహాయ కారిణియై వారిని పై మెట్టునకు లాగుచుండెను. ఈమె జీవితము వారికి సవాలుగా ఉండెను. 96 సం॥లు స్వార్థము లేకుండా జీవితాంతము వరకు పరిశుద్ధాత్మ దేవుని యొక్క నడిపింపును కలిగి, సంతోష, సమాధానములను, విజయమును జీవితములో అనుభవించెను.

అనేకుల బాధలలోనూ, సమస్యలలోనూ ఆదరణను కలుగజేసి, ఉన్నతమైన సేవ చేసి దీర్ఘకాలము జీవించి దేవుని బిడ్డల వలన సేవింపబడి జూన్ 21, 1906 వ సం॥లో మరణించింది. ఈమె యొక్క ఆత్మ వెలుగు తన చుట్టూ ఎన్నో మైళ్ళ వరకు వ్యాపించి సాతాను రాజ్యమును పడగొట్టెను.

ఈమె జీవితమును చూడగా ఎంత విద్యలేని వారైనను దేవునికి సంపూర్ణముగా అప్పగించుకొన్న యెడల బహు ఉన్నత పరిశుద్ధ సేవచేయు సామర్థ్యత దేవుడిచ్చెనని మనము చూచుచున్నాము. ఇది నిత్యజీవము నుండి వచ్చి నిలిచి యుండే సేవ.

ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras